## ప్రసంగము 11

# భాషలలో మాటలాడుట గూర్చిన వివరమేమిటి?

## (1 కొరింథీయులకు 14)

1 కొరింథీయులకు 14వ అధ్యాయములో, అద్భుతములు చేయు శక్తి గల వరమును ఉపయోగించుట గూర్చి గల విశాల సందర్భములోనే, పరిశుద్ధాత్మ చేత అనుగ్రహింపబడిన ఒక నిర్దిష్టమైన వరమును – భాషలతో మాటలాడుటను – ఉపయోగించుటకు సంబంధించిన సమస్యలపై పౌలు తన దృష్టిని కేంద్రీకరించాడు.

ఈ రోజుల్లో క్రైస్తవ సమాజములలోని కొందరు వారు భాషలతో మాటలాడుచున్నారని స్వాధికారంతో చెప్పుచుందురు. ఈ ప్రయోగ పద్ధతి "గోలస్సోలేలియ" (*glōssa* అనగా, మనము చూచుచున్న వాక్యభాగములో నున్నట్లు "నాలుకలు") అని పిలువబడుచున్నది. దాదాపుగా 1970వ సంవత్సరము మొదలుకొని, భాషలతో మాటలాడుటపైనను, స్వస్థపరచుట వంటి అద్భుతములు చేయు శక్తిగల ఇతర వరములపైనను ఒక నూతన వక్కాణింపు చెలామణిలో ఉన్నట్లగుపించుచున్నది. ఒక "ఆధ్యాత్మిక వరదాన ఉద్యమము"[1] లేచింది, అది అనేక పెద్ద పెద్ద మతశాఖలను సహితము ప్రభావితము చేసింది. వాస్తవమునకు, ఆధ్యాత్మిక వరదాన ఉద్యమము క్రైస్తవత్వము యొక్క "మూడవ ఊపు" (రోమన్ కథోలిక్కు మతము, "మొదటి ఊపు," ప్రొటెస్టెంటు మతము "రెండవ ఊపు") అని పిలువబడుచున్నది. క్రైస్తవ్యంలో ఎంతో ప్రత్యేకతను సంతరించుకొను ప్రతి విషయము అది లేఖనానుసారమైనదో కాదో యని మనము పరీక్షించి చూచుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

వారు ఆధ్యాత్మిక వరదానముగల సంఘ సభ్యులగుటకు వారి తల్లి సంఘములను సహితము వదిలిపెట్టిన కొందరున్నారు. క్రీస్తు సంఘము మరీ ఎక్కువ "హేతుబద్ధమైనదై" యుంటున్నదనునది వారి దృక్పథమై యున్నది. ఆత్మ అనుగ్రహించు వరములను కాదనుట/లేదనుట వలన, క్రీస్తు మార్గము ఎటువంటి ఉల్లాసవంతమైన ఆత్మయైనను, అనుభూతియైనను, లేదా ఔత్సుకతయైనను లేకుండా ఒక నిర్జీవమును చట్ట బద్ధమునైన పద్ధతి యగునట్లు సంఘము అనుమతించుచున్నదని వారనుకొనుచున్నారు. సంఘము, క్రొత్త నిబంధన బోధల ప్రకారమైన క్రైస్తవ్యమును పునఃరుద్ధరించినదని చెప్పుకొనుచున్నప్పటికిని, మొదటి శతాబ్దమునాటి సంఘములో ఒక భాగముగా నిజముగా నెలకొని యుండిన ఏదో ఒక దానిని తృణీకరించినదని కూడ వారు నమ్ముచున్నారు.

అలాగైతే, వీరు చెప్పుచున్నది సరైనదేనా? భాషలతో మాటలాడుట గూర్చిన వాస్తవమును నేర్చుకొనుటకు నిశ్చయంగా మనము లేఖనములను అధ్యయనము చేయవలసినదే.

## వాస్తవములేమై యున్నవి?

**భాషలతో మాటలాడుటకు అంతకు మునుపు నేర్చుకొననిది**
**మొదటి శతాబ్దములో అభ్యసింపబడినది**

భాషలతో మాటలాడుట మొదటి శతాబ్దమునాటి సంఘములో నిశ్చయముగా ఆభ్యసింపబడినది. పెంతెకొస్తు దినాన, "ఆత్మ వారికి వాక్ శక్తి అనుగ్రహించిన కొలది" అపొస్తలులు అన్య నాలుకలలో లేక అన్య భాషలతో మాటలాడారు (అపొస్తలుల కార్యములు 2:4; KJV). పేతురు కొర్నేలీకిని అతని కుటుంబ సభ్యులందరికిని బోధించిన తదుపరి, వారు బాప్తిస్మము పొందక మునుపు, పరిశుద్ధాత్మ వారి మీదికి దిగి వచ్చెను అప్పుడు వారు అన్య భాషలతో మాటలాడసాగిరి (అపొస్తలుల కార్యములు 10). పౌలు ఎఫెస్సుకు వెళ్లినప్పుడు, అచ్చట యోహాను బాప్తిస్మము గూర్చి మాత్రమే ఎరిగియుండిన కొందరు శిష్యులను కనుగొన్నాడు. వారికి లేఖనానుసారంగా బాప్తిస్మము ఇవ్వబడినప్పుడు, వారు అన్యభాషలతో మట్లాడిరి (అపొస్తలుల కార్యములు 19). అన్య భాషలతో మాటలాడుటకు గల వరము కొరింథీయులకు వ్రాయబడిన మొదటి పత్రికలో తరుచుగా పేర్కొనబడినది. తత్ఫలితంగా, – కనీసము క్రొత్త నిబంధన కాలములోనైనా – కొందరు క్రైస్తవులు అన్య భాషలతో మాట లాడారో లేదో అను సందేహము కలుగనవసరము లేదు.

**"భాషలతో మాటలాడుట" అని పిలువబడుచున్నది ఈ**
**రోజుల్లో అభ్యసింపబడుచున్నది**

"భాషలతో మాటలాడుట" అనునది ఏదో ఒకటి ఈ రోజుల్లో అభ్యసింపబడుచున్నదనియు, దానిని అభ్యసించుచున్నవారు చెప్పుచున్నట్లు, అది ఆధ్యాత్మికముగా ప్రయోజనకరమైనదై యుంటున్నదనియు మనము పైనజెప్పిన అదేవిధంగా అంగీకరించవలెను. నిస్సందేహంగా, ఈ రోజుల్లో భాషలతో మాటలాడువారు ఈ అభ్యాసములో పాల్గొనునప్పుడు వారు అలలా పొంగి పొరలి వచ్చు భావోద్రేక ఆనందావేగమును పొందుకొనుచున్నారు లేక ఆధ్యాత్మిక ఉత్తేజానుభూతి చెందుచున్నారు. ఇట్టి అనుభవమునుబట్టి వారు దేవునికి మరింత సన్నిహితమైనట్లు అనుభూతి చెందుదురు. వారు అనుభూతి చెందినది నిష్ప్రయోజనమైనదని వీరికి చెప్పుట లేదా 'మేము అనుభవించాము' అని వారనుకొనుచున్న దాని గూర్చి వాదోపవాదములు చేయుట మన పని కాదు; ఏదిఏమైనా, వారితో కూడ కలిసి బైబిలు తెలియజేప్పుచున్న సత్యములను మనము అధ్యయనము చేయగలము.

ఈ సందర్భంలో మనము ఈ రోజుల్లోని భాషలతో మాటలాడుట గూర్చిన రెండు మౌలిక ప్రశ్నలను పరిశోధనా పద్ధతి ప్రకారము పరీక్షించి చూడవలెను.

## ఈ ప్రశ్నలేమై యున్నవి?

**ఈ రోజుల్లోని "అన్య భాషలు మాటలాడుట" మొదటి శతాబ్దమునాటి**
**సంఘము చేత ఆభ్యసింపబడిన అదే వరమై యున్నదా?**

విద్యావిహీనమైన విదేశీ భాషలు కాదు. ఈ రోజుల్లో భాషలతో మాటలాడువారు క్రొత్త

నిబంధన కాలములో చేయబడిన విధంగా చేయుట లేదు. ఆది క్రైస్తవులు అన్య భాషలు మాటలాడగల వరముతో తెలియని భాషలతో మాటలాడారు. వాస్తవమునకు, "నాలుక" అను పదము ఒక "భాష" అని అర్థమిచ్చునట్లు వాడబడినది. అపొస్తలులు, "ఆత్మ వారికి వాక్ శక్తి అనుగ్రహించిన కొలది అన్యభాలతో మాటలాడసాగిరి" అని అపొస్తలుల కార్యములు 2:4 చెప్పుచున్నది. 6వ వచనం ప్రకారము, జనసమూహములో చేరియుండిన ప్రజలు "ప్రతి మనుష్యుడు తన తన స్వభాషతో వారు మాటలాడుట విని కలవరపడిరి." జనసమూహములో నుండిన వారి చేత అనేక భాషలు మాటలాడబడినవి (9–11 వచనాలు). అన్య భాషలతో మాటలాడుచుండిన వారందరును గలిలయులై యుండినప్పటికిని, జనసమూహములో ప్రతి యొక్కడు "తాను పుట్టిన దేశపు భాషతో" వారు మాటలాడుచుండిరని వినుచుండినవారు ఆశ్చర్యపడిరి (2:7, 8).[2]

పెంతెకొస్తు దినాన, వినుచుండినవారి వినికిడిలో అర్థమైన భాషలతో అపొస్తలులు మాటలాడారో లేదో అని మనము సందేహపడలేము,[3] ఇతర భాషలతో మాటలాడుటకు వారికుండిన సామర్థ్యము అద్భుతకరమైనది ఎందుచేతనంటే మాండలిక భాషలను వారు ఎన్నడైనను నేర్చుకొని అభ్యసింపలేదు గనుక వారు మాటలాడుచుండిన భాషలు వారికి తెలిసినవే అని మనము ఆశించలేము. ఇందుకు వ్యతిరేకంగా, ఈ రోజుల్లో భాషలతో మాట లాడుట అర్థములేని/అర్థముకాని కొక్కిరిబిక్కిరి (gibberish) శబ్దములు ఉచ్చరింపబడుచున్నట్లు ఉంటున్నది. సాధారణంగా, భాషలతో మాటలాడువారు, వారు అందరికి తెలిసిన మానవ భాషలతో మాటలాడుచున్నారనైనా చెప్పలేరు.

వారు క్రొత్త నిబంధన కాలములో చేయబడిన దానినే చేయుచున్నారని భాషలతో మాట లాడుటను విశ్వసించువారు చెప్పుదురు. ఆ రోజుల్లో భాషలతో మాటలాడినప్పుడు తెలిసిన భాషలు మాటలాడబడలేదని రుజువు చేయుటకు వారు 1 కొరింథీయులకు 14వ అధ్యాయాన్ని ఉపయోగించుకొందురు. వాస్తవమునకు, ఈ అధ్యాయంలోని అనేక వచనములలో అన్య భాషలతో మాటలాడునప్పుడు మాటలాడువానికి తెలియని భాష లేదా శ్రోతలకైనను తెలియని భాషలతో మాటలాడారను అంతర్భావము గోచరించుచున్నది:

> భాషతో మాటలాడువాడు మనుష్యులతో కాదు దేవునితో మాటలాడుచున్నాడు; మనుష్యుడెవడును గ్రహింపడు, గాని వాడు ఆత్మ వలన మర్మములను పలుకుచున్నాడు (14:2).
>
> భాషతో మాటలాడువాడు తనకే క్షేమాభివృద్ధి కలుగజేసికొనును; గాని ప్రవచించువాడు సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగజేయును (14:4).
>
> నేను భాషతో ప్రార్థన చేసిన యెడల, నా ఆత్మ ప్రార్థన చేయును, గాని నా మనస్సు ఫలవంతముగా ఉండదు (14:14).
>
> సంఘమంతయు ఏకముగా కూడి అందరు భాషలతో మాటలాడుచుండగా, ఉపదేశము పొందనివారైనను అవిశ్వాసులైనను లోపలికి వచ్చిన యెడల, మీరు వెర్రి మాటలాడుచున్నారని అనుకొందురు కదా? (14:23).

ఈ అధ్యాయంలోని పైన పేర్కొనబడినవి మరియు ఇతర వచనముల ద్వారా రెండు వాస్తవములు స్పష్టమగుచున్నవి: (1) కొందరు క్రైస్తవులు మాటలాడిన భాషలు నిజముగా

ఎవరికినీ – కనీసము, వారికైనా – తెలిసినవి కావు ఎందుచేతనంటే భాషల అర్థ వివరణ చెప్పుట, భాషలతో మాటలాడుటకు భిన్నమైనదై యుండెను (14:13). ఒకడు భాషలతో మాటలాడుచుండినప్పుడు, అతడు పలుకచుండినదేమిటో అతనికి తెలిసియుండవలసిన అవసరములేదు. (2) ఒకడు భాషలతో మాటలాడునప్పుడు అతడు మాటలాడుచున్నదేమిటో అవగాహనచేసికొననప్పటికిని, అతడు వరమును అంతరంగికంగా అభ్యసించుట చేత వ్యక్తిగతముగా ప్రయోజనము పొందుకొనును (14:4).

భాషలతో మాటలాడిన కొరింథీయులు, తెలిసిన మానవ భాషలు తప్ప మిగిలినవి ఏదో ఒక భాషను ఉపయోగించుచుండిరని ఈ వాక్య భాగములు సలహా ఇచ్చుచుండగా, వారు అభ్యసించుచుండిన వరము అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయంలో వర్ణించబడిన అదే వరమై యుండినదని మనము అనుకొన్నట్లయితే వాటిలో గల అర్థవంతమైన భావము కూడ అర్థమౌతుంది. ఒకరికి ఒక వరమివ్వబడియున్నట్లయితే, ఉదాహరణకు జర్మనీ దేశ భాష మాటలాడుట, అతడు జర్మనీ భాష ఎన్నడునూ నేర్చుకొననప్పటికిని, జర్మనీ దేశస్థులెవరునూ లేని ఒక సభలో అతడు ఆ భాషను మాటలాడినప్పుడు, అతనికే క్షేమాభివృద్ధి కలిగినదని అనుభూతి చెందవచ్చును. నిశ్చయముగా, మాటలాడుచున్న వాని మాటలను దేవుడు గ్రహిస్తాడు, గనుక వాడు దేవునితోనే మాటలాడుచుండును. ఏదిఏమైనా, ఆతడు మాటలాడిన భాష మరియు పరిస్థితినిబట్టి ఇతరులెవరును ప్రయోజనము పొందుకొనరు. అంతమాత్రమేగాక, వెవ్వేరు సంఘ సభ్యులు వెవ్వేరు మానవ భాషలతో – అన్నీ వారికైనను శ్రోతలకైనను తెలియనివే మాటలాడగలిగినట్లయితే, మరియు వారందరు ఒకే సమయంలో మాట్లాడినట్లయితే, ఆ సమయంలో లోపలికి ప్రవేశించు సందర్శకుడు వారందరికిని వెర్రి పట్టినదని అనుకొనవచ్చును!

*అవిశ్వాసులకు ఉపదేశించుటకు కాదు.* ఈ రోజుల్లో భాషలతో మాటలాడుటను మొదటి శతాబ్దము నాటి వరముతో పోల్చి చూచినప్పుడు, ఆదిమ సంఘమునకు ఇవ్వబడిన అద్భుతములు చేయు శక్తి గల వరము అవిశ్వాసులను క్రీస్తునంగీకరించువారుగా చేయుటకే ఉద్దేశింపబడినదనునది ఈ రెంటికినీ గల వ్యత్యాసమును నిర్ణయించు ఒక ప్రాముఖ్యమైన అంశమై యున్నది. “కాబట్టి భాషలు విశ్వాసులకు కాదు, అవిశ్వాసులకే సూచకమై యున్నవి; ప్రవచించుట అవిశ్వాసులకు కాదు, విశ్వాసులకే సూచకమై యున్నది” అని 1 కొరింథీయులకు 14:22 చెప్పుచున్నది. అర్థంపర్థం లేకుండా మాటలాడుట అప్పటికే విశ్వాసులై యున్నవారికి ఉత్తేజకరమైనదిగా లేదా క్షేమాభివృద్ధిని కలుగజేయునదిగా ఉండవచ్చును, కానీ దాని వలన అవిశ్వాసులకు ఎటువంటి ప్రయోజనమైనను చేకూరదు. అది వారికేమియు బోధించదు. దీనికి పరస్పరము తారతమ్యముగా, మరొక భాషను నేర్చుకొనకుండానే ఆ భాషలో మాటలాడుటకు గల సామర్థ్యము కేవలము అవిశ్వాసుల మనస్సుల్లో ఒక చెరగని ముద్ర వేయుటయే గాక, క్రైస్తవులు వెవ్వేరు నేపథ్యములు కలిగి ఎదురయ్యే ప్రజలకు సువార్తను ప్రకటించగలుగునట్లు వారికి తోడ్పడుట ద్వారా సౌవార్తీకరణమును ప్రోత్సాహించినది (అపొస్తలుల కార్యములు 2:4–12). మనము 1 కొరింథీయులకు 14వ అధ్యాయానికి అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయం దృష్ట్యా అర్థ వివరణ చెప్పవలెను మరియు సువార్తను ప్రకటించుటకు సహాయకరములుగా ఉండునట్లు కొరింథీయులలో కొందరికి దేవుడిచ్చిన భాషలతో మాట లాడు వరము దుర్వినియోగము చేయబడినదని మనము భావింపవలెను.

*ఆ నాటి విధంగానే అభ్యసింపబడుట లేదు.* దీనితోపాటు, ఈ రోజుల్లో భాషలతో మాటలాడువారు ఈ వారములు మొదటి శతాబ్దములో ఉపయోగింపబడిన విధంగా (లేక, కనీసము అవి ఉపయోగింపబడుటకు ఉద్దేశింపబడిన విధానములోనైనా) వారి వరములను ఉపయోగించరు. భాషలతో మాటలాడువారు వారికనుగ్రహింపబడిన వరమును సరైన విధముగా ఉపయోగించకపోవుట గూర్చి ఆందోళన చెందుచూ పౌలు 1 కొరింథీయులకు 14వ అధ్యాయాన్ని రచించాడు. తత్ఫలితంగా, ఇవ్వబడిన ఈ వరము సరైన విధంగా ఉపయోగింపబడుట గూర్చి ఆయన నిర్దిష్టమైన ఆదేశములను జారీ చేసాడు. భాషలతో మాట లాడువారు అనుసరించవలెనని పౌలు ఏర్పాటుచేసిన నియమములు ఈ క్రింది విధముగా ఉన్నాయి:

1. *సమస్తమును క్షేమాభివృద్ధి కొరకే జరుగనియ్యవలెను* (14:5, 12, 17, 19, 26). ఈ అవసరత మరొక అవసరతకు దారి తీసినది: పలుకబడిన ప్రతీ మాట/విషయము శ్రోతలకు అర్థసహితమైనదై యుండవలెను. క్షేమాభివృద్ధికి అవగాహన అవసరము. నేటి క్రైస్తవ సంఘాల్లో అభ్యసింపబడుచున్న భాషలతో మాటలాడు వరము వినువారికి క్షేమాభివృద్ధి కలుగజేయుచున్నదా? బహుశ భాషలతో మాట లాడుట ఉత్తేజవంతమైనదిగా లేదా ఉద్రేకమును పుట్టించునదిగా ఉండవచ్చును, కానీ అది క్షేమాభివృద్ధిని కలుగజేయుచున్నదా? పలుకబడినదంతయు అర్థరహితమైనదైనట్లయితే, అది క్షేమాభివృద్ధి కలుగజేయుచున్నదని పౌలు పరిగణించడు.
2. *ఒక సభలో ఇద్దరు లేక ముగ్గురు మాత్రమే, ఒకరి తరువాత (అందరు ఒకేసారి కాదు), అర్థ వివరణ చెప్పువారు అందుబాటులో ఉంటేనే భాషలతో మాట లాడవలెను* (14:27, 28). నేను భాషలతో మాటలాడుదును అని ఈ రోజుల్లో చెప్పుకొనువారు ఈ ఆదేశములను అనుసరించుచున్నారా? ప్రత్యేకించి, "అర్థము చెప్పువాడు లేని యెడల అతడు (భాషలతో మాటలాడువాడు) సంఘములో మౌనముగా ఉండవలెను" అని పౌలు రచించిన మాటలు అమలుచేయబడుట కంటె ఎక్కువ తరుచూగా అశ్రద చేయబడుచున్నవి (14:28ఎ). ఒకరు భాషలతో మాటలాడునప్పుడు మరొకరెవ్వరైనా అర్థవివరణ చెప్పువాడు ఉంటె తప్ప సభలో ఎవరును భాషలతో మాటలాడకూడదనునది వినియోగింపబడిన నియమమై యున్నది.
3. *సంఘములన్నిటిలోను స్త్రీలు మౌనముగా ఉండవలెను* (14:34, 35). ఈ నాడు భాషలతో మాటలాడుట అభ్యసింపబడు అనేక సంఘాల్లో, స్త్రీలు భాషలతో మాటలాడుచున్నారు లేదా సభలను నడిపించుటకు నాయకత్వము వహిస్తున్నారు.
4. *సమమస్తమును "మర్యాదగాను క్రమముగాను" జరుగనియ్యవలెను* (14:40). ప్రజలు భాషలతో మాటలాడునప్పుడు, వారి ఆరాధనలు క్రమమైనవిగా నిర్వహింపబడుటకు బదులుగా అస్తవ్యస్తమైనవిగా ఆచరింపబడుచున్నట్లు అగుపించును.

ఈ రోజుల్లో "గ్లోస్సోలోలియా"ను అభ్యసించువారు భాషలతో మాటలాడుట గూర్చి లేఖనములలో ఇవ్వబడిన ఆదేశములను సాధారణంగా అనుసరించరు.

*సమాన విలువ ఇవ్వబడలేదు.* బహుశ క్రొత్త నిబంధన కాలములో భాషలతో మాట లాడినదానికి ఈ రోజుల్లో భాషలతో మాటలాడబడుచున్న దానికిని మధ్య గల అతి గొప్ప వ్యత్యాసము ఈ వరమునుకివ్వబడుచున్న విలువతో ముడిపడియున్నది. భాషలతో మాట లాడుట (వారనుకొనుచుండినట్లు) ఉత్తమోత్తమమైన వరము కాదు, కానీ వరములన్నిటిలో అల్పమైనదని కొరింథీయులకు చూపించుట 1 కొరింథీయులకు 14వ అధ్యాయంలో పౌలు గురియై యుండినది. భాషలతో మాటలాడుట, తనంతటతానుగా అదొక్కటే, సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగజేయదు. దీనికి పరస్పరము తారతమ్యముగా, ఈ రోజుల్లో భాషలతో మాటాలాడువారు మధ్య, ఈ వరము నిజమైన క్రైస్తవుని సంకేతమై యున్నదని కొన్ని పర్యాయములు అనుకొనబడుచున్నది. ఆధ్యాత్మిక వరదాని గుంపులో ఉంటూ కూడ భాషలతో మాటలాడనట్లయితే వానిలో ఆధ్యాత్మికత కొదువయై యున్నదని లెక్కింపబడును. ఈ అవగాహనకున్న భాషలతో మాటలాడుట గూర్చి పౌలు కనుపర్చుచున్న దృక్పథమునకును ఎంతో వ్యత్యాసమున్నది.

### "భాషలతో మాటలాడుట" ఈ రోజుల్లో దేవుని శక్తితో అభ్యసింపబడుచున్నదా?

రెండవదిగా, ఈ రోజుల్లో భాషలతో మాటలాడుట దేవుని శక్తితో కలుగుచున్నదో లేదో అని మనము ప్రశ్నించుకొనవలెను.

*క్రొత్త నిబంధన కాలము నాటి భాషలతో మాటలాడు వరము వలె కాదు.* "భాషలతో మాటలాడుచున్నారు" అని ఈ రోజుల్లో గుర్తింపబడుచున్న దానిలో అధిక శాతం, బైబిలు కాలములో భాషలతో మాటలాడినప్పుడుండిన గుణలక్షణములను కలిగియుండుట లేదు, సరిగదా ఈ రోజుల్లో ఈ వరమును అభ్యసించుచున్నవారు పరిశుద్ధాత్మ శక్తి చేత అభ్యసించుచున్నారనునది కూడ సందేహాస్పదమే అయియున్నది. ఈ రోజుల్లో భాషలతో మాటలాడుటకు దేవుడే మూలాధారమై యున్నట్లయితే, నేడు భాషలతో మాటలాడుటకును క్రొత్త నిబంధన కాలములో మాటలాడిన దానికిని తేడా ఉండకూడదు.

*ఇతర అద్భుతములతో కూడ ఇది జరుగట లేదు.* ఇంతేగాక, భాషలతో మాటలాడుట (టోకుబేరము వలె) ఒక సముదాయములో - పరిశుద్ధాత్మ చేత అనుగ్రహింపబడి మొదటి శతాబ్ద కాలములో అభ్యసింపబడిన నానావిధ వరములలో - భాగమైయుండుటనుబట్టి ఈ రోజుల్లో భాషలతో మాటలాడుట దేవుని శక్తి చేత చేయబడుచున్నదా అని మనము సందేహపడవలెను. ఈ రోజుల్లో ఇటువంటి అద్భుతములు జరుగుటలేదు. ఆయన మొదటి శతాబ్దములో చేసినట్లుగానే నేటి దినాల్లో కూడ కొందరు భాషలతో మాటలాడుటకు అవసరమైన సామర్థ్యమును వారికి దేవుడు కలుగజేయుచున్నట్లయితే, ఆనాడు అనుగ్రహించినట్లే ఈ నాడు సహితము చనిపోయిన వారిని లేపుటకు కూడ అయన కొందరికి అధికారమును కూడ ఇయ్యవలెను (అపొస్తలుల కార్యములు 9:36-43 చూడుము). దేవుడు చనిపోయిన వారిని లేపుచుండనట్లయితే, ప్రజలు భాషలతో మాటలాడుటను కూడ ఆయన జరిగించడము లేదని అర్థమగుచున్నది.

ఇటువంటి వరములు గతించు కాలము వచ్చునని పౌలు 1 కొరింథీయులకు 13వ అధ్యాయంలో మనకు నేర్పించాడు. "... భాషలైనను నిలిచిపోవును" అని ఆయన భాషల గూర్చి ప్రత్యేకంగా పలికాడు (13:8). అయితే ఇదెప్పుడు జరుగుతుంది? "పూర్ణమైనది వచ్చినప్పుడు" మొదటి శతాబ్దము నాటి అద్భుతములు చేయు గల వరములు గతించిపోవునని పౌలు చెప్పుచున్నాడు (13:10). "పరిపూర్ణమైనది" (*teleios*) క్రీస్తు యొక్క రెండవ రాకడను సూచించుట లేదు. ఎందుచేతనంటే ఈ పదము తటస్థ/మధ్యస్థ పదమై యున్నది: "పరిపూర్ణమైనది" గూర్చి పౌలు తెలియజెప్పాడు. అలాగైతే, ఈ పరిపూర్ణమైనది ఏమై యున్నది? సందర్భమును మనస్సులో ఉంచుకొనుచు, పౌలు సంఘము యొక్క పరిపక్వత గూర్చి మాటలాడుచుండెను. సంఘము పరిపూర్ణమైనదైనప్పుడు, అద్భుతములు చేయు శక్తి గల వరములు గతించిపోవును. దేవుని ప్రత్యక్షత సంపూర్ణమై సంఘము సంపూర్ణంగా ఎదిగినప్పుడు, అద్భుతములు చేయు శక్తిగల వరములు – భాషలతో మాటాలాడు వరముతో కూడ – యిక ఏ మాత్రమును అవసరం లేదు. కాబట్టి, అవి నిలిచిపోయినవి.

ప్రజలు దేవుని శక్తి చేత భాషలతో మాటలాడకపోయినట్లయితే, ఆ అభ్యాసము వెనుక ఏమి (దాగి) యున్నట్లు? భాషలతో మాటలాడుట వారు అత్యధికంగా ఉద్రేకులై యున్న గుంపులో భాగమై యున్నప్పుడు ప్రజలు ఉపయోగించుకొను ఒక పాండిత్యముగల ప్రవర్తనై యుండుననునది ఇందుకు అత్యంత సహేతుకమైన వివరణయై యున్నది. ఈ వరమును అభ్యసించుట ద్వారా వారు ఆధ్యాత్మిక ప్రయోజనము మరియు సామాజిక ఆమోదము పొందుకొందురని అనుకొందురు. వారు భాషలతో మాటలాడునప్పుడు, వారి నియంత్రణకు మించిన శక్తులతో కదలింపబడుచున్న అనుభూతి పొందుకొనవచ్చును; కానీ వారిని దేవుడు ప్రేరేపించుచున్నాడని అది రుజువు చేయదు. చరిత్రయందంతటను, ప్రజలు వారి దేవతల చేత కదలింపబడుచున్నారను అనుభూతి పొందుకొన్నారు గనుక వారు హేతుబద్ధముకాని ప్రవర్తనలో నిమగ్నులయ్యారు. దేవుడైన యెహోవా వారి ప్రవర్తన వెనుక ఉండెనని ఈ అనుభవములు ఎలాగైతే రుజువు చేయవో, అలాగే భాషలతో మాటలాడువారి పరమానందంతో కూడిన ఆధ్యాత్మిక పరవశం అతడు దేవుని శక్తి చేత మాటలాడాడని రుజువు చేయదు.

### మనము "భాషలతో మాటలాడినట్లయితే" దానిలో గల గొప్ప విశేషమేమిటి?

"ఈ రోజుల్లో మనము భాషలతో మాటలాడుట అంత ముఖ్యమా? అది తప్పా లేక హానికరమా?" అని యిప్పటికిని ఒకరు ప్రశ్నించవచ్చును. వాస్తవానికి, భాషలతో మాటలాడు వరమును అభ్యసించు ఒక వ్యక్తి లేదా సంఘము అనేక కారణములనుబట్టి పొరపాటు చేయుచున్నవారై యుండవచ్చును. (1) వారు ఇటువంటి అనుభవమునకు లేఖనానుసారముకాని విలువను ఆపాదించవచ్చును. భాషలు మాటలాడు వరము యొక్క విలువను పౌలు తగ్గిస్తూవుంటే, వారు ఆ విలువను హెచ్చించవచ్చును. (2) ఈ వరమును ఉపయోగించునప్పుడు వారు దేవుని నియమములను పాటించకపోవచ్చును, తద్వారా వారి ఆరాధనలు అస్తవ్యస్తమైనవౌతాయి మరియు సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగదు. (3) బహుశ భాషలతో మాటలాడువారు అట్టి అనుభవము గూర్చిన వారి అనుభూతులు మతపరంగా వారి అంతిమ అధికారమగునట్లు – అత్యంత ప్రాముఖ్యమైనదని ఎంచవచ్చును. ఇది అత్యంత అపాయకరమైన స్థితి.

## ముగింపు

నిశ్చయంగా, నిదర్శనమును పరిశీలనగా పరీక్షించి బైబిలు బోధించుచున్నది అంగీకరించదగునో లేదో రూఢిపర్చుకొనుట తన అంతరాత్మ ప్రబోధములతో పనులుచేయు క్రైస్తవుడు చేయగల ఉత్తమోత్తమమైన పనియై యున్నది. భాషలతో మాటలాడుట దేవుడు అనుగ్రహించిన వరమై సకల యుగములయందలి సంఘము నిమిత్తము ఉద్దేశింపబడినదైనట్లయితే, మనము దానిని అభ్యసించుదాము (మన చేతనైతే)! భాషలతో మాటలాడుట దేవుడు అనుగ్రహించిన వరము కానిదై యుగాంతము వరకును క్రైస్తవుల కొరకు ఉద్దేశింపబడినది కాకపోయినట్లయితే, మనము దానిని అభ్యసించకుందుము!

మనము భాషలతో మాటలాడనట్లయితే, మన క్రైస్తవ మార్గము మృతమైనది మరియు మందబుద్ధిగలదగునని దీని అర్థమా? కాదు, ఏ మాత్రమును కాదు. దేవుని సంఘము యొక్క సిద్ధాంతము మరియు ఆరాధన కొరకు బైబిలు సంబంధమైన మాదిరిలో మనస్ఫూర్తిని అత్యున్నత స్థాయికి హెచ్చించవలసినదియు మన ఆత్మలకు త్రాణ నిచ్చునదియు ఎంతో ఇమిడియున్నది. దేవుని ఆరాధించుట మరియు ఆయనను సేవించుట మన జీవితములకు ఎంతో సంతోషోల్లాసమును కలుగజేయుచు. కొన్ని పర్యాయములు దేవుని స్తుతించుచు ఆనంద బాష్పములు రాల్చుటకు మన హృదయములు ఉప్పొంగునట్లు చేయును. సజీవమైనదియు, ఉద్రూతలూగించునదియు, ఆధ్యాత్మికమునైన విశ్వాసమును అనుభవించుటకు మనము భాషలు మాటలాడుటలో నమ్మకముంచవలసిన పనిలేదు మరియు దానిని అభ్యసించవలసిన అవసరంలేదు.

---

సూచనలు

[1]*Charismata* – 12:4లో నున్నట్లు "వరముల"కు ఒక పదమై యున్నది. [2]ఈ ప్రజలు వెవ్వేరు స్థలముల నుండి వచ్చినవారైనప్పటికిని వారు ఒకరితో నొకరు సంభాషించుకొనగలిగి యుండిరి. వారు నిస్సందేహముగా గ్రీకు భాషలో, ఆనాటి సార్వజనిక భాషలో, సంభాషించుకొన్నారు మరియు వారి స్వదేశ భాష లేక మాండలికి భాష గాక వారు మాటలాడుచుండిన భాషా భేదమును గుర్తించారు. అదే విధంగా, ఈ రోజుల్లో అనేకమంది ఒక స్వదేశ భాష లేక మాండలిక భాష కలిగియున్నారు, కానీ విస్తృతముగా ప్రసిద్ధమైయున్న ఆంగ్లము వంటి భాషలో కూడ సంభాషించగలరు. [3]ఒకరు భాషల్లో మాటలాడునప్పుడు జరిగే అద్భుతము మాటలాడుటతో ఉన్నదా లేక వినికిడిలో ఉన్నదా యని దైవ జ్ఞాన వేదాంత విద్యనభ్యసించు విద్యర్థులు తీవ్రంగా చర్చించారు. అపొస్తలులు ఇతర భాషలతో మాట్లాడారా, లేక అపొస్తలులు వారి స్వదేశీ భాషలతో మాటలాడుచుండినప్పటికిని శ్రోతలు వారి స్వదేశ/మాండలిక భాషలను వినునట్లు దేవుడు వారికి సామర్థ్యమును కలుగజేసాడా? దీనికి జవాబు వాక్యమే ఇచ్చుచున్నది: వారు "అన్య భాషలతో" మాటలాడసాగిరి (అపొస్తలుల కార్యములు; 2:4; CEV). అద్భుతము మాటలాడుటలో ఉన్నదే గాని, వినికిడిలో లేదు.